# ఆత్మ(త్తో)లో ఒక మాట +

రచన:
మాస్టర్ రవి.

ప్రపంచమంతా ఏహ్యంగా చూసే నీలో, నాకేదో ప్రత్యేకత గోచరిస్తోంది. అదేవిటని మాత్రం అడక్కు.

అదేవిటో చెప్పగలిగితే, నేనీ అవ్యక్తమైన బాధ ఎందుకు అనుభవిస్తాను చెప్పు ?

చింపిరి జుత్తు, చీపికళ్ళు, చినిగిన బట్టలు, వంకర టింకర నడక, విచిత్రమైన నవ్వు; రూపంలో ఏదో లోపం; ఇవన్నీ-నీలో చూసి, ప్రపంచం నిన్ను దూరంగా నెట్టి, అపహాస్యం చేసింది. నేనుకూడా అలాంటివారి సాంగత్యంలోనే వున్నాను. ఆ సంఘమే నన్నూ చుట్టి వుంది.

కానీ; ఆ ముహూర్తం, ఆ క్షణం ఎలాంటిదో నేనేం చెప్పగలను? అంతా వెగటుగా చూసే నీ చీపికళ్ళవెనుక; అత్యంత ప్రశాంత శాంతత నాకు కనిపించింది. చినిగిన నీ బట్టలు, నీ దారిద్ర్యాన్ని, అందలి దైన్యాన్ని, బాధని భారాన్ని-నాకు విప్పి చెప్పి - 'నీవూ నన్ను గేలిచేస్తావా?' అని ప్రశ్నించాయి. అలా చేయగలనా నారాయణీ!

నీ వంకర టింకర నడక, జీవిని-విధి నడిపే నగ్న సత్యాన్ని తెలియజెప్పింది.

నీ విచిత్రమైన నవ్వు; అనవసరంగా బాహ్యాడంబరాన్ని చూసి, మోసపోతూ; అదే సహజమని భ్రమనే ఈ వెర్రిప్రపంచాన్ని చూసి నవ్వినట్టుగా, నా మది తెలిపింది.

నీ రూపంలో లోపం, చందమామకైనా లోపం తప్పదనే నిగూఢ రహస్యాన్ని చెప్తున్నట్టుగా వుంది.

అవును. నీ బాధ నాకు తెలుసు.

నారాయణీ! విచిత్ర వ్యక్తుల్ని ఈ ప్రపంచం ఎప్పుడు అర్థంచేసుకుంది చెప్పు ?

వాస్తవాన్ని మరచి, స్తసంచేసే ఈలోకం, నీలోని గొప్పతనాన్ని తెలుసుకోవడం చాలా కష్టం.

అంతమాత్రాన నీవు బాధపడనవసరం లేదు.

ఆరోజు రాకపోదు. ఈ ప్రపంచమంతా, నీలోని దివ్య జ్యోతిని చూసి-

'జో'రా' అని ముక్కున వేలేసుకునే రోజు అతి చేరువలోనే వుంది నారాయణీ!

అంతవరకూ నీవు వేచివుండక తప్పదు.

వెన్నెల వచ్చేవరకూ, చకోరి, చీకటిలో గడుపక తప్పదు. వెన్నెల రావాలీ అంటే, చంద్రుడు పదునాలుగు కళలూ మార్చాలి. ఆఖరునగాని వెలుగు కానరాదు.

ఈనాడు నిన్ను దూరంచేసుకున్న ఈ లోకం; ఓనాడు నీచేరువకే వస్తుంది. ఆనాడు నీవే వీరందరినీ చూసి నవ్వుదువుగాని!

కానీ, నాకు తెలుసు. నీవు సామాన్యలా వర్తించవు. ప్రవర్తించవు. వర్తించవు.

''అయ్యో! వీరంతా ఇన్నాళ్లూ అమాయకులై, సత్యా సత్యాలమధ్య ఊగిసలాడేరే, ఈనాటికైనా రాచబాటకు రాగలిగేరు కదా-'' అనే సంతృప్తికరమైన చిరునవ్వు, నీ చిన్నారి అధరాలమీద మధురంగా తేలిపోతుంది.

అదే నీలో గొప్పతనం!!

ఆనాడు, ఆ సువర్ణ దివసంనాడు నేనెంతగా ఆనందిస్తానో నీకెలా తెలుస్తుంది?